# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12,  Fax : 27665013,  Email-cpimtelangana@gmail.com


తేది: 04.10.2021

## పోడు భూములకు హక్కుపత్రాలిచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించాలి
## ఉద్యమాన్ని నీరుగార్చే ప్రకటనలు చేయవద్దు

అటవీ హక్కుల గుర్తింపు చట్టంలో పేర్కొన్న విధంగా 2005 డిసెంబర్ 13 కంటే ముందు సాగులో ఉన్న పోడు సాగుదారులందరికీ హక్కుపత్రాలిచ్చేందుకు కార్యాచరణతో కూడిన షెడ్యూల్‌ను తక్షణం ప్రకటించాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. దీంతోపాటుగా 2014 జూన్ 2వరకు తేదీని పొడిగించేందుకు చట్టసవరణ కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. ముఖ్యమంత్రి ప్రకటించినట్టు అఖిలపక్ష పార్టీలను వారం రోజుల్లోపు ప్రధానమంత్రి దగ్గరకు తీసుకెళ్ళాలని, చట్ట సవరణ త్వరగా అయ్యే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

శతాబ్ధాలుగా అడవుల్లో ఉంటున్న గిరిజనులు, పేదలకు అటవీ భూములపై హక్కులు ఇవ్వాలని వామపక్ష పార్టీలు యూపీఏ ప్రభుత్వంపై వత్తిడి తేవడంతో అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఆమోదం పొందింది. 2005 డిశంబర్ 13 కంటే ముందు సాగులో ఉన్న వారందరికీ 10 ఎకరాలలోపు హక్కులు ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008 నుండి 2012 వరకు చట్టాన్ని అమలు చేసింది. తెలంగాణ రాష్ట్ర పరిధిలో 13 లక్షల ఎకరాలపై హక్కులు ఇవ్వవచ్చని లెక్కలు తీసింది. గ్రామసభల ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తులు ఎలా పెట్టుకోవాలో కూడా అవగాహన కల్పించలేదు. మొక్కుబడిగా అమలు చేసిన ఫలితంగా వేలాదిమంది దరఖాస్తులే పెట్టుకోలేదు. అయినా 7,61,061 ఎకరాలపై 2,12,173 దరఖాస్తులను పెట్టుకున్నారు. ఇందులో కేవలం 93,639 మందికి 3,00,284 ఎకరాలపై మాత్రమే హక్కుపత్రాలిచ్చారు. మిగిలిన 1,18,534 దరఖాస్తులను కారణాలు చూపకుండా తిరస్కరించారు.

తక్షణం చట్టంలో పేర్కొన్న విధంగా హక్కులు ఇవ్వాలని గత నెల రోజుల నుంచి అఖిలపక్ష పార్టీలు, గిరిజన, ప్రజాసంఘాలు ఉద్యమాన్ని ఉధృతం చేశాయి. అక్టోబర్ 5న పోడు సమస్య ఉన్న ప్రాంతాల్లో సడక్‌బంద్/ రాస్తారోకో చేస్తున్నాయి. ఉద్యమాన్ని నీరుగార్చేందుకే ముఖ్యమంత్రి బూటకపు ప్రకటనలు చేస్తున్నారు. 2005 డిశంబర్ 13 కంటే ముందు సాగులో ఉన్న వారందరికీ హక్కుపత్రాలిచ్చేందుకు తక్షణం షెడ్యూల్ ప్రకటించాలని, చట్టసవరణ కోసం కేంద్రంతో పోరాడాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
**రాష్ట్ర కార్యదర్శి**